# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక



## ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



- అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్

4


సంపుటి : 01 | సంచిక : 72 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 08 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4

# ఇది ప్రజా ప్రభుత్వం

- ప్రజ ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యం
- మున్సిపల్లో గెలిపించే బాధ్యత మీది
- అభివృద్ధి చేయించే బాధ్యత నాది..
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

'మాది ప్రజా ప్రభుత్వం.. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యంగా మా ప్రభుత్వం పని చేస్తుందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. తొర్రూరు, వర్ధన్నపేట మున్సిపాలిటీలో నిర్వహించిన ఎన్నికల ప్రచారాన్ని ముగించుకొని అనంతరం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ మున్సిపాలిటీలలో ఎంపీలు కడియం కావ్య, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డితో కలిసి వివిధ వార్డుల్లో పోటీ చేస్తున్నఅభ్యర్థులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులతో కలిసి రోడ్ షో నిర్వహించారు. *- మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి*

2 లో


## బీఆర్ఎస్‌తో జనగామ అభివృద్ధి

- బీఆర్ఎస్ అభ్యుర్థులను గెలిపించాలి
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

3

జనగామ మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యుర్థలను గెలిపించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జనగామ పట్టణ పరిధిలోని 5, 6, 7, 8, 9, 10వ మున్సిపల్ వార్డుల ఎన్నికల ప్రచారంలో జనగామ ఎమ్మెల్యే డా పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని పట్టణ ప్రజలను కోరారు.





## అంగరంగ వైభవంగా పెద్దమ్మ తల్లి బోనాలు

తెలంగాణ ప్రజల జీవనశైలికి, సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ ముల్కనూరు గ్రామంలో అంగరంగ వైభవంగా జరిగింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో శనివారం ముదిరాజ్ కులస్తులు సంప్రదాయ పద్ధతుల్లో పెద్దమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహించి అమ్మవారి కృప కోసం మొక్కులు చెల్లించారు.

3 లో





# ఇది ప్రజా ప్రభుత్వం

- ప్రజ ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యం
- మున్సిపల్లో గెలిపించే బాధ్యత మీది
- అభివృద్ధి చేయించే బాధ్యత నాది
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** 'మాది ప్రజా ప్రభుత్వం.. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యంగా మా ప్రభుత్వం పని చేస్తుందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. తొర్రూరు, వర్ధన్నపేట మున్సిపాలిటీలో నిర్వహించిన ఎన్నికల ప్రచారాన్ని ముగించుకొని అనంతరం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ మున్సిపాలిటీలలో ఎంపీలు కడియం కావ్య, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డితో కలిసి వివిధ వార్డుల్లో పోటీ చేస్తున్నఅభ్యర్థులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులతో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రెండేండ్ల క్రితం ఏర్పడిన ప్రజాప్రభుత్వం ప్రజల ఆకాంక్షల మేరకు రైతన్నకు భరోసా, పేదవాడికి భద్రత, యువతకు ఉపాధి, మహిళలకు గౌరవం, విద్య, వైద్యానికి ప్రాధాన్యం, విద్యార్థుల భవిష్యత్తుకు పునాది లాంటి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజాప్రభుత్వం అందిస్తుంది. స్టే. ఘనపూర్ మున్సిపాలిటీలో 18, జనగామ మున్సిపాలిటీలో 30 వార్డులున్నాయి. అన్నివార్డుల్లో మన కాంగ్రెస్, మిత్ర పక్షాలు సిపిఎం, సిపిఐ పార్టీ తరపున పోటీచేస్తున్న అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి మన అందరి గుండెల్లో ఉన్న ఇందిరమ్మ ప్రభుత్వాన్ని దీవించాలి.' అని కోరారు. ఎన్నికలు తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాకారంతో ఇన్‌చార్జి మంత్రిగా ఘనపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అదనంగా మరో రూ.50 కోట్లు మంజూరు చేయించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇప్పటికే మొదటి విడతలోనే ఘనపూర్ మున్సిపాలిటీలో 300, జనగామలో 600 ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగింది. అంతే కాదు ఏప్రిల్ రెండో విడతలో మళ్ళీ ఇచ్చే కోటాతో పాటు అదనంగా మరో 1000 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేసే బాధ్యత నాదేనని హామీ ఇచ్చారు. 'జనగామ మున్సిపాలిటీలో దొంగ ఓట్లతో గత బీఆర్ఎస్ నేత గెలిచారన్నది వాస్తవం. ఇక్కడ ప్రతాప్ రెడ్డి శాసనసభ్యులు కాలేకపోయినా ప్రజాసేవల, నియోజకవర్గం అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అభివృద్ధి పనుల కోసం ముఖ్యమంత్రి, మంత్రుల వద్దకు నిరంతరం వస్తున్నారు. ఇప్పటికే రూ.30 కోట్లతో జనగామ పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. సిడిఎఫ్ ఫండ్ రూ.10 కోట్లు మంజూరు అయితే అందులో పట్టణానికే మూడున్నర కోట్లు కేటాయించాం. 40 సంవత్సరాలుగా సర్వే నెంబర్ 53లో 230 ఎకరాల్లో 1800 మంది పేదలు ఇండ్లు కట్టుకొని నివసిస్తున్నారు. తప్పకుండా ఆ శాఖ మంత్రిగా వాటిని పరిశీలించి క్రమబద్ధీకరణ చేసే బాధ్యత తీసుకుంటాను. రూ.1 కోటి 50లక్షలతో బతుకమ్మ కుంటను అభివృద్ధి చేసుకున్నాం . రంగప్ప చెరువును అభివృద్ధి చేసే బాధ్యత కూడా మాదే. వీటితో పాటు రోడ్లు, డ్రైన్లు, బ్రిడ్జిలు, లింక్ రోడ్లు , ఇండ్లపై ఉన్నహైటెన్షన్ తీగల తొలగింపు లాంటివి చేసుకుందాం..' అని తెలిపారు. మున్సిపాలిటీల్లో సమగ్ర అభివృద్ధి జరగాలంటే తప్పకుండా ఫిబ్రవరి 11న జరిగే ఎన్నికల్లో మన కాంగ్రెస్ అభ్యర్థులను మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు.










## సమస్యలపై పోరాడే అభ్యర్థులను గెలిపించాలి

- సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడే సిపిఐ అభ్యర్థులను మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి ప్రజలను కోరారు. హుస్నాబాద్ పట్టణంలోని 9, 16, 17, 18 వార్డుల్లో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థులు ఎనగందుల లక్ష్మి నారాయణ, కొయడ కొమురయ్య, గడిపె మల్లేశ్, సిరిగిరి కనకవ్వలను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో నిర్వహించిన సిపిఐ అభ్యర్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ, హుస్నాబాద్ పట్టణంలో త్రాగునీటి సరఫరా, కరెంట్ సమస్యల పరిష్కారం, పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల మంజూరు వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సిపిఐ పార్టీనే సాధించిందని గుర్తు చేశారు. సిపిఐ అభ్యర్థులు ఎన్నికైతే పట్టణ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ పరిష్కారానికి కృషి చేస్తారని, పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే సిపిఐ పార్టీని ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజీవరెడ్డి, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, మండల సహాయ కార్యదర్శి పొదిల కుమారస్వామి, సిపిఐ నాయకులు అయిలేని మల్లారెడ్డి, జంగ విజయ, కాల్వల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలు వింటూ.. హామీ ఇస్తూ..

- 14వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి రాజశేఖర్‌రెడ్డి ప్రచారం

**జనగామ, మన చౌరాస్తా :** పట్టణంలో 14వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి కదిరె రాజశేఖర్ రెడ్డి ప్రచారం జోరగా సాగుతోంది. శనివారం వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు విన్నవిస్తున్న సమస్యలను సావధానంగా వింటూ వాటిని పరిష్కరిస్తానని హామీ ఇస్తూ ముందు సాగుతున్నారు. జనగామ మున్సిపాలిటీ అభివృద్ధి బీఆర్ఎస్‌తే సాధ్యమని, 11న జరిగే ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.





## న్యాయవాది స్వప్నను హత్య చేసిన వారిని
# కఠినంగా శిక్షించాలి

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో మహిళా న్యాయవాది స్వప్న పై దాడి చేసి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ కోర్టు ఎదుట న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ మధ్యకాలంలో న్యాయవాదులపై దాడులు, హత్యలు సర్వసాధారణమైపోయాయని, న్యాయవాదులకు రక్షణ చట్టం లేకపోవడంతోనే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని న్యాయవాదులు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే రోజుల్లో న్యాయవాదుల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా, కేంద్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు.



# అంగరంగ వైభవంగా పెద్దమ్మ తల్లి బోనాలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** తెలంగాణ ప్రజల జీవనశైలికి, సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ ముల్కనూరు గ్రామంలో అంగరంగ వైభవంగా జరిగింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో శనివారం ముదిరాజ్ కులస్తులు సంప్రదాయ పద్ధతుల్లో పెద్దమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహించి అమ్మవారి కృప కోసం మొక్కులు చెల్లించారు. తెలంగాణ గ్రామీణ సంస్కృతిని అద్దం పట్టేలా జరిగిన ఈ వేడుకల్లో భక్తి, నమ్మకం, ఆనందం అన్నీ కలసి గ్రామాన్ని పండుగ వాతావరణంతో నింపాయి. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా గ్రామస్తులంతా అమ్మవారి ఉత్సవంలో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా వందలాది మంది మహిళలు పసుపు, కుంకుమ, పూలతో అలంకరించిన రంగురంగుల బోనాలను తలపై మోసుకుంటూ శివశక్తుల పూనకాల నడుమ ఊరేగింపుగా సాగారు. డప్పుల మోగుడు, భక్తిగీతాల ఆలాపన, మహిళల నృత్యాలు ఊరేగింపుకు మరింత శోభను చేకూర్చాయి. "అమ్మోరమ్మ" అనే నినాదాలతో గ్రామ ప్రధాన వీధులన్నీ మార్మోగాయి. ఊరేగింపు ప్రతి ఇంటి ముందుగా సాగుతూ గ్రామ ప్రజల్ని ఆధ్యాత్మిక ఉత్సాహంతో నింపింది. అనంతరం భక్తులు బతుకమ్మ బండ సమీపంలో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలను భక్తిశ్రద్ధల నడుమ సమర్పించారు. గ్రామ ప్రజల సంక్షేమం, పంటలు సమృద్ధిగా పండాలని, కుటుంబాలు ఆరోగ్యంగా, సుఖశాంతులతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామంలో శాంతి, ఐక్యత నిలవాలని భక్తులు ఆకాంక్షించారు. పెద్దమ్మ తల్లి బోనాల పండుగ ద్వారా తరం తరాలుగా వస్తున్న తెలంగాణ సంప్రదాయాలు, గ్రామీణ ఆచారాలు జీవంతంగా కొనసాగుతున్నాయని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ వేడుకలు కేవలం ఆరాధన మాత్రమే కాకుండా గ్రామ ఐక్యతకు, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు నిదర్శనంగా నిలుస్తున్నాయని వారు పేర్కొన్నారు.





# బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

**ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** జనగామ మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జనగామ పట్టణ పరిధిలోని 5, 6, 7, 8, 9, 10వ మున్సిపల్ వార్డుల ఎన్నికల ప్రచారంలో జనగామ ఎమ్మెల్యే డా పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని పట్టణ ప్రజలను కోరారు. ప్రత్యర్థి పార్టీలు అబద్ధపు ప్రచారాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయని, అమలు కాని హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఎమ్మెల్యే విమర్శించారు. జనగామలో గుండాలకు, రౌడీ రాజకీయాలకు ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ ఇంచార్జ్ రౌడీలా వ్యవహరిస్తూ బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులను బెదిరిస్తున్నారని, కిడ్నాప్‌లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వీరనారి చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య



పోరాటాల గడ్డ అయిన జనగామలో రౌడీలకు చోటు లేదని అన్నారు. జనగామ జిల్లాను ఇచ్చింది కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీయేనని గుర్తు చేశారు. జిల్లాను మరింత అభివృద్ధి చేయాలంటే బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తన స్వంత నీలిమ హాస్పిటల్‌లో గత రెండు సంవత్సరాలుగా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నానని చెప్పారు. రాబోయే మూడు సంవత్సరాలు కూడా ఉచిత వైద్య సేవలు కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. పేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్నామని, నిమ్స్ ఆసుపత్రిలో అత్యవసర వైద్యం కోసం LOCలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనను ప్రజలు పోల్చి ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కల్యాణ లక్ష్మి, తులం బంగారం పొందిన వారు కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, పొందని వారు బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేయాలని వ్యాఖ్యానించారు. మహిళా భృతి రూ.2500 పొందిన మహిళలు కాంగ్రెస్‌కు, భృతి పొందని మహిళలంతా బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. చదువుకునే మహిళలకు స్కూటీ ఇస్తామని చెప్పి ఇప్పటివరకు అందని మహిళలంతా బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. పట్టణ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో సెకెండ్ తెలంగాణ సీడ్ ఫెస్టివల్

- **సాంప్రదాయ విత్తనాల సంరక్షణకు వేదిక**

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** రాష్ట్రంలో సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులు స్థానిక విత్తనాల పరిరక్షణకు ఊతమిచ్చే ఉద్దేశంతో హైదరాబాద్ సమీపంలోని రంగారెడ్డి జిల్లా కడ్తల్ మండలం అన్మాసుపల్లి గ్రామంలో సెకెండ్ తెలంగాణ సీడ్ ఫెస్టివల్ ఘనంగా జరుగుతోంది. ఈ సీడ్ ఫెస్టివల్ ఫిబ్రవరి 6 నుంచి 8 వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన రైతులు, విత్తన పరిరక్షకులు, వ్యవసాయ నిపుణులు పాల్గొని స్థానిక మరియు సాంప్రదాయ విత్తనాల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అంతరించిపోతున్న పంటల విత్తనాలను తిరిగి రైతుల చేతికి అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శనివారం నాడు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు కోపరేటివ్ సొసైటీ రైతుల ఆధ్వర్యంలో సహజ వ్యవసాయం, విత్తన



స్వావలంబన వ్యవసాయ జీవవైవిధ్యం వంటి అంశాలపై నిపుణులచే వర్క్‌షాప్‌లు అవగాహన సదస్సులు ప్రసంగాలు నిర్వహించారు. రసాయన ఎరువులు పురుగుమందుల ప్రభావం సహజ సాగు ద్వారా రైతులకు కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు.ములుకనూరు సహకార సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డితో పాటు సంఘానికి చెందిన వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు సాంప్రదాయ విత్తనాల ప్రాముఖ్యత, రైతులే విత్తన సంరక్షకులుగా మారాల్సిన అవసరాన్ని వివరించారు. ములుకనూరు సహకార సంఘం చేపడుతున్న వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాల గురించి కూడా వారు తెలియజేశారు. రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో సీడ్ ఫెస్టివల్ సందడిగా కొనసాగుతోంది. ఇటువంటి కార్యక్రమాలు రైతుల్లో చైతన్యం పెంచడమే కాకుండా భవిష్యత్ తరాలకు విత్తన సంపదను కాపాడే దిశగా దోహదపడతాయని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరాం, సిజేఆర్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు దిలీప్ రెడ్డి, సిజేఆర్ వ్యవస్థాపక అధ్యక్షులు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- **అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్**

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** జిల్లాలో రాబోయే ఎన్నికలను సమర్థవంతంగా, పారదర్శకంగా, చట్టబద్ధంగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలపై ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవోలకు శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమగ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌తో పాటు ట్రైనింగ్ నోడల్ అధికారిణి మాధురి షా పాల్గొని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. పోలింగ్ ప్రక్రియలో పాటించవలసిన నియమాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్లకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, శాంతియుత



వాతావరణంలో పోలింగ్ నిర్వహణ, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. పోలింగ్ సమయంలో ఎదురయ్యే సాధారణ సమస్యలు, వాటి పరిష్కార విధానాలపై కూడా అధికారులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియలో వార్డు వారీగా క్రమబద్ధంగా కౌంటింగ్ నిర్వహణ, ప్రారంభ, తుది కౌంటింగ్ విధానం, సందేహాస్పద బ్యాలెట్ పేపర్ల పరిశీలన, రీకౌంటింగ్‌కు సంబంధించిన నిబంధనలు, ఫలితాల ప్రకటన విధానం వంటి అంశాలను సవివరంగా వివరించారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం ఎన్నికల నియమావళి ప్రకారం పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరాన్ని అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి తన బాధ్యతను పూర్తి అవగాహనతో, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడే విధంగా ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- **అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలి**
- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద**

**వరంగల్, మన చౌరాస్తా :** మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వర్ధన్నపేట, నర్సంపేట మునిసిపాలిటీలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యాలెట్ పేపర్లు, సీల్స్, స్టేషనరీ, పోలింగ్‌కు అవసరమైన ఇతర సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో ఎక్కడా లోపాలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎన్నికల



సామగ్రి పంపిణీ నుంచి పోలింగ్ ముగిసే వరకు ప్రతి దశలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని అన్నారు. అలాగే ఎన్నికల విధుల్లో నియమితులైన సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎన్నికల శిక్షణలో ఇచ్చిన సూచనలను పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా విధులు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సుమా, మునిసిపల్ కమిషనర్లు సుధీర్ కుమార్, భాస్కర్, ఆర్డీఓ కార్యాలయ డిఎఓ ఫణి కుమార్, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాపాలన ప్రగతి బాట

# బహిరంగ సభ ఏర్పాట్లు పూర్తి

- **చెల్పూర్ లో జరిగే సభకు రానున్న సీఎం రేవంత్ రెడ్డి**
- **సభా స్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే జీఎస్సార్..**
- **సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలి**

**భూపాలపల్లి, మన చౌరాస్తా :** నేడు (ఆదివారం) మధ్యాహ్నం 2 గంటలకు గణపురం మండలం చెల్పూరు గ్రామ శివారులో జరిగే ప్రజాపాలన ప్రగతి బాట బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు, అట్టి సభకు ముఖ్య అతిథిగా రానున్న సీఎం రేవంత్ రెడ్డి రానున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. ఈరోజు శనివారం సాయంత్రం చెల్పూర్ లోని సభా స్థలిని ఎమ్మెల్యే జీఎస్సార్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు ఎర్రబెల్లి వరదరాజేశ్వర్ రావు ఇతర ముఖ్య నేతలతో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... రేపు జరిగే బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. చెల్పూర్ సభ కంటే ముందు రేగొండ మండలం కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని సీఎం రేవంత్ రెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. అనంతరం ఆలయంలో రూ.12.15 కోట్లతో చేపట్టిన పునర్నిర్మాణ పనులను ప్రారంభిస్తారని అన్నారు. అనంతరం చెల్పూర్ శివారులో జరిగే ప్రజాపాలన ప్రగతిబాట బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు.

## ఎన్నికల ఫిర్యాదులు, సమాచారం కోసం

# కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**ములుగు, మన చౌరాస్తా :** 2వ సాధారణ మున్సిపాలిటీ ఎన్నికలు 2026 నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ఫిర్యాదులు, సమాచారం కొరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని ములుగు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టి.ఎస్. శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు మున్సిపాలిటీకి 1వ సాధారణ ఎన్నికల లో మొత్తం 20 కౌన్సిల్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణ కొరకు ఫ్లయింగ్, స్టాటిస్టిక్, వీడియో సర్వేయలెన్స్ బృందాలు, ఎం సి ఎం సి, ఎం సి సి, ఇతర ఎన్నికల సంబంధిత పర్యవేక్షణ బృందాలను, ఎన్నికల అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నేపథ్యం లో ప్రజలను ప్రలోభ పెట్టే నగదు, మద్యం, కానుకల పంపిణీ, ప్రచారం, అక్రమ నగదు రవాణా, ఇతర ప్రభావిత అంశాలపై నిఘా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ అంశాలు ఎవరి దృష్టిలోకైనా వచ్చినట్లయితే కంట్రోల్ రూమ్ నం.18004257109 లో ఫిర్యాదు చేయవచ్చని, ఇతర ఎన్నికల సంబంధిత సమాచారం కోసం సంప్రదించవచ్చని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**